క్లుప్తంగా

ఆదమరిస్తే అంతే



కోతకు గురైన బలిజిపేట-నారాయణపురం రోడ్డు

బలిజిపేట: బలిజిపేట–నారాయణపురం రహదారిలో రోడ్డు కోతకు గురై ఉండడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రహదారి వెడల్పు తక్కువగా ఉండడం, రోడ్డుకు బెర్ములు లేకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చేటప్పుడు పక్కకు తప్పుకునేందుకు వీలులేకుండా పోతోంది. అంతే కాకుండా రోడ్డు అడుగుభాగంలో కోతకు గురవుతుండడంతో వాహనాల రాకపోకల వల్ల రోడ్డు విరిగిపోయే ప్రమాదముందని చెబుతున్నారు. పెద్దపెద్ద లారీలు, బస్సులు వచ్చేటప్పుడు పక్కకు తప్పుకునేందుకు వీలు కుదరడం లేదని, ఆదమరిస్తే పంటపొలాల్లోకి పడిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టపగలే వెలుగులు.. పట్టని అధికారులు



ఎమ్మార్‌నగరంలో పట్టపగలే వెలుగుతున్న విద్యుత్‌దీపాలు

పార్వతీపురం రూరల్: పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగుతూ సంబంధిత శాఖ సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. మండలంలోని ఎమ్మార్‌నగరం గ్రామంలో శివాలయానికి ఎదురుగా ఉన్న కాలనీలో రాత్రి, పగలనే తేడా లేకుండా విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. చీకటి పడగానే వెలుగుతూ ఉదయం అవగానే ఆరిపోవాల్సిన విద్యుత్ దీపాలకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు లేకపోవడంతో విలువైన విద్యుత్ ఈ విధంగా వృథా అవుతోంది.

గంగమ్మతల్లిని దర్శించుకున్న మంత్రి సంధ్యారాణి



అమ్మవారి ఘటం తలపై మోస్తున్న మంత్రి సంధ్యారాణి

మక్కువ: మండలంలోని పనసభద్ర పంచాయతీ మూలవలస గ్రామదేవత గంగమ్మతల్లిని గిరిజనశాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి శుక్రవారం దర్శించుకున్నారు. మూలవలస గ్రామదేవత గంగమ్మ పండగను గిరిజనులు జరుపుకోనుండడంతో, మంత్రి సంధ్యారాణిని గ్రామస్తులు ఆహ్వానించారు. గ్రామానికి చేరుకున్న మంత్రి సంధ్యారాణి గంగమ్మతల్లి ఘటాలకు పూజలు నిర్వహించి, అమ్మవారి ఘటం తలపై మోశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాలరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.


బాలల హక్కులు, రక్షణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

మక్కువ: స్థానిక గ్రామసచివాలయంలో కిశోరీ బాలికలకు శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీవో బి.అనంతలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలికల్లో రక్తహీనత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల, బాలికలకు కలిగే అనర్థాలపై తెలియజేశారు. అలాగే పీవోసీఎస్ఓ చట్టంపై, బాలల హక్కులు, రక్షణపై ప్రతి బాలిక తెలుసుకోవాలని సూచించారు. అనంతరం మక్కువలోని పలు పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, సూపర్‌వైజర్ రాజశ్రీ, సచివాలయం సిబ్బంది, మహిళాపోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిజంలో సాలూరు వాసికి ఏయూ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రేగాన షణ్ముఖరావు

సాలూరు: జర్నలిజంలో సాలూరు వాసి రేగాన షణ్ముఖరావుకు ఏయూ డాక్టరేట్ లభించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగ పరిశోధక విద్యార్థి అయిన రేగాన షణ్ముఖరావు ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ నుంచి డాక్టరేట్‌ను అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. కాగా షణ్ముఖరావు ప్రస్తుతం అనకాపల్లి కలెక్టరేట్‌లో పీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారు.

మలుపుల్లో పొంచి ఉన్న ముప్పు



పార్వతీపురం రూరల్: చినబొండపల్లిలో ఉన్న మలుపు వద్ద రహదారిపై ఏర్పడిన గుంతల్లో వర్షపునీరు



పార్వతీపురం రూరల్: వెంకంపేటలో ఉన్న మలుపు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలు



సాలూరు రూరల్: కందులపథం రోడ్డునుంచి కొట్టుపరువు కొత్తవలసకు వెళ్లే రహదారి దుస్థితి

పార్వతీపురం రూరల్:

మండలంలోని వెంకంపేట, చినబొండపల్లి గ్రామాల మధ్యలో ఉన్న రహదారి మలుపుల వద్ద రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహన చోదకులు తీవ్రస్థాయిలో అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తోంది. వర్షాలు కురుస్తున్న కారణంగా రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపునీరు చేరడంతో గుంత ఏ మేరకు ఉందో అంచనా వేయలేని పరిస్థితుల్లో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మలుపుల్లో రహదారికి ఇరువైపులా నిర్మాణాలు ఉన్న కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలను అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. ఇంకోపక్క ఈ రహదారి కొరాపుట్ అంతర్‌రాష్ట్ర రహదారి కావడంతో ప్రతిరోజూ ఒడిశా నుంచి ఆంధ్రాకు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపై గుంతలు పూడ్చి సురక్షితమైన రహదారులను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, వాహన చోదకులు కోరుతున్నారు. అలాగే మలుపుల వద్ద హెచ్చరికలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రహదారిపై గోతులు కప్పేదెన్నడో?

సాలూరు రూరల్: మండలంలోని పలు రహదారులు వర్షంపడితే వాహనాలు రాకపోకలు మాట అటుంచితే కనీసం నడవడానికి కూడా వీలులేని పరిస్థితిలో ఉంటున్నాయి. ఆ కోవలోనే కందుల పథం రోడ్డు నుంచి కొట్టుపరువు కొత్తవలస మీదుగా బూర్జి గ్రామం వెళ్లే రహదారి గత ప్రభుత్వంలో మంజూరై బీటీ రోడ్డు నిర్మాణం జరిగింది. అయితే రోడ్డు నిర్మాణం దాదాపు 75 శాతం పూర్తి కాగా కొట్టు పరువు గ్రామం నుంచి రోడ్డు నిర్మాణ సమయంలో కొంతమంది రైతులు తమ పొలాల వద్ద రోడ్డు కోసం ఆక్రమణ జరుగుతోందని అడ్డంపెట్టడంతో అక్కడినుంచి కాంట్రాక్టర్ రోడ్డు పని నిలిపివేశారు. కొన్నిరోజుల తరువాత రైతులు రోడ్డు వేసేందుకు ఒప్పుకున్నప్పటికీ కాంట్రాక్ట్ సమయం పూర్తికావడం అదేసమయంలో ఎన్నికలు సమీపించడంతో రోడ్డు పనులు అలాగే మిగిలిపోయాయి. ప్రస్తుతం బూర్జి గ్రామం మీదుగా గిరిజన గ్రామాల ప్రజలు కొంతవరకు బీటీరోడ్డుపై ప్రశాంతంగా ప్రయాణంచేసి కందులపథం రోడ్డుకు చేరుకునే మధ్యలో గుంతల రోడ్డు దాటాల్సి వస్తుండడంతో పలు గ్రామాల గిరిజన ప్రజలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. గిరిజన గ్రామాలకు రోడ్లు వేస్తున్నట్లు ప్రచార ఆర్భాటం చేస్తున్న గిరిజన శాఖ మంత్రి ఈ రోడ్డు పనులు పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జిల్లా కేంద్రంలో డెంగీ నివారణ దినోత్సవం

- వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలి
- డాక్టర్ జగన్‌మోహన్



పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు



బలిజిపేట: వెంగాపురం సంతలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ అధికారులు, సిబ్బంది

పార్వతీపురంటౌన్: డెంగీ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లుతో కలిసి మలేరియా శాఖ అధికారులు, సిబ్బంది, వైద్యసిబ్బంది, మున్సిపల్ సిబ్బంది ర్యాలీలో పాల్గొని మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి కూడలి వరకు డెంగీ నివారణ నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. అక్కడ మానవహారంగా రూపొంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహన్ రావు మాట్లాడుతూ డెంగీ నివారణకు ఆరోగ్య, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖలు సయుక్తంగా పలు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా ప్రస్తుతం స్ప్రేయింగ్ కొనసాగుతోందన్నారు. అలాగే ఫ్రైడే డ్రైడే, ఏఎల్ఓ, ఐఎస్ఎస్, ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, నీరు నిల్వ లేకుండా చూసుకుని, ఉపయోగించే నీటి తొట్టెలపై మూతలు ఉంచడం వంటి జాగ్రత్తలు పాటిస్తూ, డెంగీ దోమ ఉత్పత్తిని అరికట్టడంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఏఎంఓ సూర్యనారాయణ, జిల్లా కన్సల్టెంట్ రామచంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేవీ ఫకీర్, రాజు, ఏఎస్ఓ వీరనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు పుష్ప, వైద్యసిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బలిజిపేట: మన ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే రోగాలు సోకుతాయని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా బలిజిపేట, వెంగాపురంలలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి మాట్లాడుతూ నిల్వ ఉన్న మంచినీటిలో డెంగీ వ్యాధికి సంబంధించిన దోమలు పెరుగుతాయని అందువల్ల వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అదేవిధంగా వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలని సూచించారు. కొబ్బరి చిప్పలు, ఖాళీ డబ్బాలు, టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరం, తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు ఉంటాయని అటువంటి సందర్భాల్లో వైద్యాధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫేజ్-2 గ్రామాల్లో రీసర్వే



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఉమామహేశ్వరరావు

సీతానగరం: మండలంలోని రెండు గ్రామాల్లో జరుగుతున్న ఫేజ్–2 రీ సర్వే పనులు భౌతికంగా పూర్తి కావచ్చాయని రికార్డుల దాఖలా భూముల వివరాల తనిఖీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ దయానిధిపురం క్లస్టర్ పరిధిలో గ్రామాల్లో జరిగిన సర్వే పనులను పరిశీలించారన్నారు. ఆయా గ్రామాల్లో రైతుల వద్ద ఉన్న భూముల నకళ్లను, పిత్రార్జితంగా వచ్చిన భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి అసలైన రైతులకు భూములు చెందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు గ్రామాల్లో రైతుల వివరాలు సేకరించి కార్యాలయంలో ఉన్న రికార్డులను పరిశీలించి రీసర్వే పనులు పూర్తి చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, సీనియర్ సహాయకులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలకు వందనం



పట్టణంలో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్: దేశంకోసం నిత్యం శ్రమిస్తూ ప్రత్యర్థులను మట్టి కరిపిస్తూ ప్రాణాలను సైతం అర్పిస్తున్న భారత సైనికుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర కొనియాడారు. మనదేశంపై దాడి చేసిన పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ ద్వారా ఎదురుదాడి చేసి విజయం సాధించిన సందర్భంగా సైనికులకు మద్దతుగా శుక్రవారం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత్ జోలికొస్తే నామరూపాలు లేకుండా చేస్తామని సైనికులు ఆపరేషన్ సిందూర్ ద్వారా రుజువు చేశారన్నారు. కార్యక్రమంలో వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సభ్యులు, వివిధ రాజకీయపార్టీల నాయకులు, యువతీ యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని డిస్మిస్ చేయాలి



పీఓ అశుతోష్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంఘం నాయకులు

పార్వతీపురం: గుమ్మలక్ష్మీపురం మండలంలోని రేగిడి పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి సస్పెన్షన్‌కు గురైన తోట రమేష్‌ను డిస్మిస్ చేయాలని కోరుతూ ఉత్తరాంధ్ర గిరిజన సంక్షేమ సంఘం నాయకులు ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు తాడంగి సాయిబాబు, ఊయక గంగరాజు, ఆరిక ప్రభాకర్, పాలక రంజిత్ కుమార్‌లు మాట్లాడుతూ పాఠశాలలో గిరిజన బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించడం, అనుచితంగా వ్యవహరించడం తదితర సంబంధిత వీడియోలు కూడా అధికారులకు సమర్పించామన్నారు. ఉపాధ్యాయుడి ప్రవర్తనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుడి కుమారుడు పదోతరగతి రాసిన కేంద్రంలోనే ఆయన ఇన్విజిలేషన్ వేయించుకుని అక్రమాలకు పాల్పడిన సంఘటనకూడా ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని చెప్పారు. ఈ విషయాలన్నీ పరిగణనలోకి తీసుకుని ఆ ఉపాధ్యాయుడిని విధులనుంచి డిస్మిస్ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఐ.రామారావు, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎం.అమర్‌నాథ్ తదితరులు ఉన్నారు.

తూనికలు, కొలతల్లో తేడాలు వస్తే ఖబడ్దార్..!

పార్వతీపురంటౌన్: తూనికలు, కొలతల్లో తేడా వస్తే కఠినంగా వ్యవహరిస్తామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రత్నరాజు హెచ్చరించారు. లీగల్ మెట్రాలజీ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పార్వతీపురం పట్టణంలోని పలు దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఐరన్ దుఖాణాల్లో తనిఖీలు నిర్వహించి వినియోగ దారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయిస్తే తక్షణమే ఫిర్యాదు చేయాలని సూచించారు. దుకాణాల్లో తూనికలు, కొలతల విషయంలో తేడా ఉన్నట్లు అనుమానం వచ్చినట్‌లెత్తై తక్షణమే తమకు ఫిర్యాదుచేయాలని సూచించారు. దుకాణదారులు తూకాలకు సీల్ తప్పనిసరిగా వేయించాలని, లేనట్‌లెత్తై అటువంటి దుకాణదారులపై ప్రత్యేక నిఘా ఉంచి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

పరారీలో నిందితులు

పార్వతీపురం రూరల్: వివాహితను దారికాచి దాడిచేసి, దుర్భాషలాడిన కారణంగా ఈనెల 12వ తేదీన పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ మేరకు పార్వతీపురం పట్టణానికి చెందిన తండ్రీకొడుకులు పూసర్ల సురేష్, చిన్నికృష్ణలపై కేసు నమోదు చేయగా దర్యాప్తు నిమిత్తం పట్టణ పోలీసులు నిందితుల ఇంటికి వస్తున్న సమాచారం తెలుసుకున్న వారు పరారయ్యారని ఎస్సై గోవింద తెలిపారు. నిందితుల కోసం గాలింపు చేపడుతున్నట్లు ఎస్సై చెప్పారు.

అకాల వర్షాలతో రబీ రైతులకు తప్పని ఇబ్బందులు



ధాన్యం రాలిపోతున్న వరిచేను

సీతానగరం: అకాల వర్షాలకు పండిన వరి చేల నుంచి ధాన్యం రాలిపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. మండలంలోని వెంకటాపురం, బూర్జ, కృష్ణరాయపురం, చెల్లంనాయుడువలస, లక్ష్మీపురం, బుడ్డిపేట, పెదభోగిలి, పణుకుపేట, తామరఖండి, బళ్లకృష్ణాపురం, కొత్తవలస, గెడ్డలుప్పి, నీలకంఠాపురం గ్రామాల్లో రైతులు రబీ వరిచేను సాగు చేశారు. వరిచేను ఆశాజనకంగా ఉండడంతో కష్టానికి ఫలితం దక్కుతుందని ఆశించిన రైతులకు ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షాలు కోతకు వచ్చిన వరి చేలపై ప్రభావం చూపడంతో ధాన్యం మళ్లలోనే రాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే పరిపక్వ దశకు వచ్చిన వరిచేలు కోతకోసిన వరి చేలు ఇళ్లకు చేర్చడానికి వర్షాలు అడ్డురావడంతో ధాన్యం తడిచిముద్దవ్వడం వలన పూడిక చేయడానికి అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. రబీ వరి చేను పండించడానికి అయ్యే ఖర్చుకన్నా అకాల వర్షాల కారణంగా పండించిన ధాన్యాన్ని ఇళ్లకు చేర్చడానికి అయ్యే ఖర్చు తడిసిమోపెడవుతోందని వాపోతున్నారు. అలాగే పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కేంద్రాలు ప్రారంభించకపోవడంతో సార్టెక్స్ మిషన్‌లు అమర్చిన రైస్‌మిల్లర్లు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, దీంతో గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు.

పీఎం జన్‌మన్ పనులు త్వరగా పూర్తిచేయాలి

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ



అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: పీఎం జన్‌మన్ గృహనిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో గృహనిర్మాణాలు, ఉపాధిహామీ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో నిర్మాణం అవుతున్న పీఎం జన్‌మన్ గృహనిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణాల పురోగతిపై ప్రతిరోజూ పర్యవేక్షించి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద చేపడుతున్న పనులతో పాటు ఐటీడీఏ పరిధిలోని మండలాల్లో జీడి మొక్కల పెంపకానికి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో జీడి పిక్కల కొనుగోలుకు మంచి అవకాశాలు ఉన్నాయని గిరిజనులకు ప్రయోజకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పీఏఓ శ్రీనివాస్, వెలుగు ఏపీడీ వై.సత్యంనాయుడు, పీహెచ్ఓ మణి భూషణ్, ఉపాధిహామీ ఏపీడీ సురేష్‌నాయుడు, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకురాలు ఆర్.కృష్ణవేణి, డిప్యూటీ ఈఓ జ్ఞానప్రకాశ్, ఏపీఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

నరక యాతన



బడ్డిపేట రేవులో శ్మశాన వాటిక



శివాలయం రేవు సమీపంలో శ్మశాన వాటిక



రైల్వే బ్రిడ్జి సమీపంలో ఉన్న శ్మశానవాటిక

సీతానగరం: మండలంలోని పెదభోగిలి మేజర్ పంచాయతీలో శ్మశానవాటికకు వెళ్లేందుకు ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. పంచాయతీలో గల నాలుగు శ్మశాన వాటికల్లో మూడు బుడ్డిపేట, శివాలయం రేవు, బ్రిడ్జి సమీపంలో సువర్ణముఖి నదీతీరంలో ఉండడం వల్ల ఇసుక రీచ్‌ల్లో మైనింగ్ చేస్తున్న కారణంగా శ్మశాన వాటికలకు దారి కరువైంది. దీంతో స్థానిక ప్రజలంతా తమకు దారి చూపాలంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షనమే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టులు



బోరబంద గ్రామంలో విరిగిన కల్వర్టు

సాలూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో కల్వర్టుల పరిస్థితి అధ్వానంగా ఉంది. అలాంటి పరిస్థితిలోనే మండలంలోని చిన బోరబంద గ్రామంలో ప్రధాన రహదారి కల్వర్టు విరిగిపోయి కల్వర్టు పక్కనుంచి వెళ్లేవారికి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. విరిగిన కల్వర్టులను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉద్యానవన పంటలను ఇన్సూరెన్స్‌తో ఆదుకోవాలి

- సాదాసీదాగా మండల సమావేశం
- ఎంపీటీసీ వెంకట్‌మృతికి సంతాపం



ఎంపీటీసీ వెంకట్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

మక్కువ: ఉద్యానవన పంటలకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించి రైతులను ఆదుకోవాలని ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో డీడీ.స్వరూపరాణి అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ పారమ్మ, జెడ్పీటీసీ శ్రీనివాసరావు హాజరయ్యారు. ముందుగా పనసభద్ర ఎంపీటీసీ సభ్యుడు సామంతుల వెంకట్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో రెండునిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం సమావేశంలో వ్యవసాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుల గుర్తింపు కార్డుల కోసం ఏపీఎఫ్ఆర్ఎస్ పోర్టల్‌లో వివరాలు నమోదుచేసుకోవాలని సూచించారు. రైతులకు సంక్షేమపథకాలను డీబీటీ ద్వారా అందించేందుకు అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఇంతవరకు మండలంలో 7650మంది రైతులను గుర్తించామన్నారు. అనంతరం ఎంఈవో శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో మండలంలోని 16మోడల్ ప్రైమరీ పాఠశాలలను గుర్తించామని, ఒక్కో పాఠశాలకు నలుగురు ఉపాధ్యాయులు, ఒక ప్రైమరీ హెచ్‌ఎంను నియమించనున్నట్లు తెలిపారు. ఇంతవరకు 23,972 నోట్‌బుక్స్, 16,759 టెస్ట్‌బుక్స్ వచ్చాయన్నారు. శంబర పీహెచ్‌సీ వైద్యాధికారి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 30వతేదీ నుంచి వచ్చేనెల 13వతేదీ వరకు శంబర పీహెచ్‌సీ పరిధిలోని పలు గిరిజన, మైదాన ప్రాంతాల్లో ఐఆర్ఎస్ స్ప్రేయింగ్, అలాగే 42రోజుల పాటు ఏఆర్ఎస్ స్ప్రేయింగ్ జరిపించనున్నట్లు తెలిపారు. ఉద్యానవనశాఖాధికారి ప్రత్యూష మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులు మక్కువ చూపించేలా ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. అలాగే ఉపాధిహామీపథకం, ఐసీడీఎస్, మత్స్యశాఖ, వెలుగు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు వారివారి శాఖల ప్రగతిని వివరించారు.

జరగని ధాన్యం సేకరణ

ఈ సందర్భంగా జెడ్పీటీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజ కొనుగోలుచేస్తామని, ప్రకటించినప్పటికీ ఆ దిశగా ధాన్యం సేకరణ జరగలేదన్నారు. తప్పనిసరి పరిస్థితిల్లో రైతులు దళారులకు విక్రయించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. అలాగే ఈఏడాది మామిడి, జీడి రైతులు ప్రకృతివైపరీత్యాలతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు సాగుచేస్తున్న ఉద్యానవన పంటలకు మన్యం జిల్లాకు చెందిన రైతులు ఇన్సూరెన్స్ చెల్లించే అవకాశంలేకుండా పోయిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇన్సూరెన్స్ చెల్లించే అవకాశం రైతులకు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, ఐసీడీఎస్ సీడీపీవో బి.అనంతకుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలపరిషత్ అభివృద్ధి అధికారిగా ఎంఎల్ఎన్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడి ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లగా ఎంపీడీఓ పోస్టు ఖాళీ కావడంతో ఎంఎల్ఎన్ ప్రసాద్‌ను ఎంపీడీఓగా నియమిస్తూ జెడ్పీ సీఈఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు శుక్రవారం మండలానికి వచ్చాయి. గతంలో ఎంఎల్ఎన్ ప్రసాద్ ఏఓగా బాధ్యతలు నిర్వహించడంతో పాటు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహించారు. ఎంఎల్ఎన్ ప్రసాద్ ఎంపీడీగా రావడాన్ని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజలు స్వాగతిస్తున్నారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా రహిత గ్రామాలుగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీతానగరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి అన్నారు. ఈ మేరకు గరుగుబిల్లి మండలంలోని ఉల్లిభద్రలో శుక్రవారం సర్పంచ్ శెట్టి దివ్యలక్ష్మి ఆధ్వర్యంలో నవోదయం 2 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. అనంతరం ఉల్లిభద్ర గ్రామాన్ని సారా రహిత గ్రామంగా డిక్లేర్ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ శ్రీనివాసరావు, సచివాలయం, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.